# 7 కోట్ల వాచీలు ఎవరెవరికి?

- సింగపూర్ నుంచి 12 వాచీల కొనుగోలు
- కంపెనీ డబ్బు హవాలా రూపంలో చెల్లింపు
- సింగపూర్ నుంచి స్వయంగా వాచీలు తెచ్చిన ముఖ్యనేత
- వాచీలు ఎవరెవరికి ఇచ్చారో ఆరా తీస్తున్న ఈడీ?



ఢిల్లీ, సెప్టెంబర్ 28: పొంగులేటి ఇండ్లు, కార్యాలయాలపై ఈడీ దాడులకు సంబంధించి కొత్త విషయాలు బయటికి వస్తున్నాయి. మొత్తం 12 వాచీలు కొనుగోలు చేసినట్టు ఈడీ గుర్తించిందని ఢిల్లీ వర్గాలు తెలిపాయి. ఒక్కొక్కటి రూ.7 కోట్లు చొప్పున వీటి విలువ రూ.84 కోట్లు. ఈ డబ్బు రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఖాతా నుంచి విజయవాడలోని ఓ వ్యక్తికి బదిలీ చేశారని, అక్కడి నుంచి ఒక హవాలా వ్యాపారి ద్వారా విదేశాలకు చేరాయని ఈడీ గుర్తించినట్టు పేర్కొన్నాయి. ముఖ్యనేత సింగపూర్‌కు వెళ్లినప్పుడు స్వయంగా విమానాశ్రయంలో 12 వాచీలను తీసుకొని తిరిగి వచ్చారని తేలినట్టు వెల్లడించాయి. అయితే ఆ వాచీలను ఎవరికి ఇచ్చారన్నది పెద్ద ప్రశ్నగా మారింది. ఒక వాచీని రాష్ట్రంలో మీడియా హౌస్ ఓనర్‌గా మారిన ఒక జర్నలిస్టుకు ఆఫర్ చేయగా తిరస్కరించారని, దీంతో ఇతరులకు పంపారని గుసగుసలు వినిపిస్తున్నాయి. పన్ను ఎగవేత ద్వారా, హవాలా మార్గంలో తరలించిన డబ్బుతో వాచీలు తేవడం పెద్ద నేరమని చెప్తున్నారు. దీంతో వాటిని ఎవరెవరు తీసుకున్నారనే కోణంలో దర్యాప్తు జరుగుతున్నట్టు ఢిల్లీ వర్గాలు పేర్కొన్నాయి. కంపెనీ నుంచి డబ్బులు బదిలీ చేయడం, హవాలాకు మళ్లించడం వంటివన్నీ ఓ ఆడిటర్ పర్యవేక్షణలో జరిగాయని, అందుకే ఆయనను ఈడీ అధికారులు పిలిపించి, చాలాసేపు ప్రశ్నించినట్టు పేర్కొన్నారు. వాచీలు ఎలా వచ్చాయి? ఎవరికి ఇచ్చారు అనే సమాచారాన్ని ఆ ఆడిటర్ ఈడీ అధికారులకు ఇచ్చినట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో వాచీలు అందుకున్న ప్రముఖుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని చెప్తున్నారు.

# భోగారంలో అక్రమ మైనింగ్!

- రోడ్డు పనుల కోసం యథేచ్ఛగా మట్టిని తోడేస్తున్న పొంగులేటి బినామీలు
- స్థానికుల ఆరోపణ.. లారీల అడ్డగింత
- ఉన్నతస్థాయి ఒత్తిడితో వదిలేసిన అధికారులు?



లారీల్లో మట్టిని తరలిస్తున్న అక్రమార్కులు

కీసర, సెప్టెంబర్ 28: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర మండలం భోగారంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బినామీలు అక్రమంగా మైనింగ్‌కు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపించారు. పోలీస్, రెవెన్యూ అధికారుల అండదండలతోనే ఈ వ్యవహారం సాగుతున్నదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కీసర మండలంలోని భోగారం నుంచి చర్లపల్లి వరకు రోడ్డు పనులను పొంగులేటి కుటుంబ సభ్యులకు చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు అప్పగించినట్టు తెలిసింది. రోడ్డు పనులకు అవసరమైన మట్టిని భోగారంలోని తిరుమల ఇంజినీరింగ్ కళాశాల వెనుక భాగంలోని గుట్టల నుంచి నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళ లారీల్లో తరలిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మట్టిని తరలించడమే కాకుండా గ్రామంలోని చెరువులు, కుంటలు, కాలనీలోని రోడ్లను ధ్వంసం చేస్తున్నారని మండిపడుతున్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తున్న నాలుగు లారీలను ఇదే ప్రాంతంలోని ఎన్ఎఫ్‌సీ ఎంప్లాయిస్ కో-ఆపరేటింగ్ హౌసింగ్ సొసైటీ వారు, కాలనీవాసులు కలిసి అడ్డుకున్నారు. మట్టి అక్రమ తరలింపుపై సొసైటీ అధ్యక్షుడు రూప్‌సింగ్, సెక్రటరీ లక్ష్మణ్‌నాయక్, కోశాధికారి వసంత్‌రావు కీసర సీఐ వెంకటయ్య, తహసీల్దార్ అశోక్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడకు చేరుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు నాలుగు లారీలు, హిటాచీ, జేసీబీలను స్వాధీనం చేసుకున్నారని, అయితే ఉన్నతాధికారులు, మంత్రుల నుంచి ఫోన్లు రావడంతో వాటిని వదిలేశారని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

# లగ్జరీ వాచీ టు మనీ లాండరింగ్!

- పొరుగు రాష్ట్రంలోని ఎలక్ట్రిక్ లిస్టెడ్ కంపెనీ, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మధ్య ఆర్థిక లావాదేవీలు
- ఇరు కంపెనీల భాగస్వామ్యంతో మనీలాండరింగ్
- ఆ ఎలక్ట్రికల్ కంపెనీకి 9 దేశాలతో సంబంధాలు
- ఈడీ దర్యాప్తులో కొత్త కోణాలు



హైదరాబాద్,సెప్టెంబర్28(నమస్తే తెలంగాణ): పొరుగు రాష్ట్రం ప్రధాన కేంద్రంగా ఎలక్ట్రిక్ పవర్ పరికరాల డిజైన్, ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే ఒక లిస్టెడ్ కంపెనీకీ, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు మధ్య జరిగిన లావాదేవీల మీదనే ఈడీ ఫోకస్ చేసినట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ముందుగా లగ్జరీ చేతి గడియారాల స్మగ్లింగ్ వ్యవహారంపై దర్యాప్తు చేపట్టగా, భారీ ఎత్తున ఆర్థిక అక్రమ లావాదేవీలు జరిగినట్టు కూడా చెన్నై కస్టమ్స్ అధికారులు గుర్తించారని సమాచారం. పొరుగు రాష్ట్రానికి చెందిన లిస్టెడ్ కంపెనీ, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కలిసి భారీ ఎత్తున మనీ లాండరింగ్‌కు పాల్పడినట్టు దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. పొంగులేటి హర్షారెడ్డి 2022 నుంచి లగ్జరీ వాచీల స్మగ్లింగ్ చేస్తున్నారని, ఇప్పటివరకు ఆయన కనీసం 60 నుంచి 70 చేతి గడియారులు విక్రయించి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అంచనాకు వచ్చినట్టు తెలిసింది. విదేశాల్లో ఒక్కొక్క వాచీని రూ.కోటి చొప్పున కొనుగోలు చేసి, ఇండియాలో సంపన్న వర్గాల వారికి రూ.మూడు కోట్ల నుంచి రూ.ఏడు కోట్లకు విక్రయించినట్టు సమాచారం. స్మగ్లింగ్‌కు పాల్పడటం ద్వారా ఎగ్గొట్టిన వ్యాట్, జీఎస్టీ, కస్టమ్స్ ఇతర పన్నుల పన్నుల విలువ ఎంత ఉంటుంది? ఎవరెవరి మధ్య లావాదేవీలు సాగాయి? అనే కోణంలో దర్యాప్తు చేయగా, డొంక కదిలినట్టు తెలిసింది.

### 35 కోట్ల నుంచి 500 కోట్లకు..

పొరుగు రాష్ట్రంలో ప్రధాన కేంద్రం కలిగిన సదరు ఎలక్ట్రిక్ కంపెనీకి హైదరాబాద్‌లోనూ కార్యాలయం ఉన్నది. దీనిని 2010లో స్థాపించారు. దీని అధీకృత వాటా మూలధనం రూ.35 కోట్లుగా ఉన్నట్టు తెలుస్తున్నది. సదరు కంపెనీ ఉన్నట్టు 2019 వరకు ఎవరికీ పెద్దగా తెలియదు. ఆ తరువాత అనూహ్యంగా పుంజుకున్నది. 2023 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.500 కోట్ల ఆదాయాన్ని ప్రకటించింది. ఆ కంపెనీకి, రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు మధ్య 2020 నుంచి సన్నిహిత సంబంధాలు కొనసాగుతున్నట్టు తెలిసింది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో కీలకంగా ఉన్న నేతకు, కడప జిల్లాకు చెందిన సదరు కంపెనీ డైరెక్టర్‌కు మధ్య ముందుగా పరిచయం ఏర్పడ్డట్టు తెలిసింది. అక్కడి నుంచి డైరెక్టర్ల పరిచయాలు, ఆర్థిక సర్దుబాటు, ఇచ్చిపుచ్చుకోవడం వరకు సాన్నిహిత్యం పెరిగినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఎలక్ట్రిక్ కంపెనీకి అనుబంధ కంపెనీగా ఉన్న సోలార్ ప్లాంటు డైరెక్టర్‌కు నవీన్‌కుమార్ ద్వారా లగ్జరీ వాచీ ఒకటి చేరినట్టు చైన్నై కస్టమ్స్ అధికారులు గుర్తించారు. వాచీకి సంబంధించిన క్రయ, విక్రయాల్లో డబ్బు ఎవరికి, ఎలా చేరింది? అనే అంశంపై లావాదేవీలను పరిశీలించినప్పుడు పెద్ద ఎత్తున మనీ లాండరింగ్ అంశం దృష్టికి వచ్చినట్టు సమాచారం. దీంతో కస్టమ్స్ అధికారులు ఈడీకి సమాచారం ఇచ్చారు. అప్పటివరకు కస్టమ్స్ అధికారులు చేసిన దర్యాప్తు ఆధారంగా నివేదిక రూపొందించి ఈడీకి సమర్పించారు. పూర్తి స్థాయి వివరాలు రాబట్టడం కోసం ఈడీ ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్‌ను రంగంలోకి దించింది. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే రెండు ప్రధాన అంశాలతో ముడిపడి ఉన్న కేసు కాబట్టి సమగ్ర క్యాష్ ట్రాన్సాక్షన్ రిపోర్ట్ తెప్పించినట్టు తెలిసింది.

### తొమ్మిది దేశాలతో సంబంధాలు

2018 వరకు జాతీయంగానే ఎలక్ట్రిక్ పవర్ పరికరాలను విక్రయించే సదరు సంస్థకు ప్రస్తుతం తొమ్మిది దేశాలతో సంబంధం ఉన్నట్టు కస్టమ్స్ దర్యాప్తులో తేలింది. ఇందులో లగ్జరీ వాచీలను దిగుమతి చేసినట్టు నిర్ధారించిన హంకాంగ్ దేశంతోపాటు మయన్మార్, యూఎస్ లాంటి దేశాలతో కంపెనీకి సంబంధం ఉన్నట్టు తేలింది. రెండు కంపెనీల మధ్య 33 బోగస్ స్టార్టప్ కంపెనీలున్నాయని గుర్తించినట్టు సమాచారం. వాటి ద్వారానే పేరు మీద క్రిప్టో టెతర్ కరెన్సీ, క్రిప్టో బిట్‌కాయిన్ రూపంలో లావాదేవీలు జరిగినట్టు తేలిసింది. గత ఏడాది డిసెంబర్‌లో ఎలక్ట్రిక్ లిస్డెడ్ కంపెనీకి చెందిన కడప, హైదరాబాద్ కార్యాలయాల్లో ఐటీ రైడ్స్ జరిగాయి. ఆ తరువాత ఈ ఏడాది మార్చిలో మరోసారి ఐటీ రైడ్స్ జరిగాయి. ఆయా నివేదికలు ఇవ్వాలని ఐటీ అధికారులను ఈడీ కోరినట్టు తెలిసింది. దీని ద్వారా ఈడీకి మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.

# ఆ కాంట్రాక్ట్ ఎలా దక్కింది?

- నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు దక్కడంపై ఈడీ ఆరా?
- మేఘాతో లోపాయికారి ఒప్పందాలపైనా నజర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబానికి చెందిన నివాసాలు, ఆఫీసుల్లో ఈడీ అధికారులు ఏ కేసుకు సంబంధించిన సోదాలు నిర్వహించారన్న చర్చ కొనసాగుతున్నది. లగ్జరీ వాచీల కేసు, యూరో ఎగ్జిమ్ బ్యాంక్ గ్యారెంటీలు, రూ.650 కోట్ల టీడీఎస్ కేసు, కుమారుడు పొంగులేటి హర్షారెడ్డికి చెందిన రూ.1,300 కోట్ల పైచిలుకు ఆస్తులకు సంబంధించిన వివరాలపై ఈడీ ఆరా తీసినట్టు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. అయితే, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కాంట్రాక్ట్ పొంగులేటి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకోవడంపై కూడా ఈడీ ప్రత్యేకంగా సమాచారం సేకరించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. మొత్తం రూ.4,350 కోట్ల ప్రతిపాదిత అంచనా వ్యయంతో చేపడుతున్న ఈ ఎత్తిపోతల్లో తొలి ప్యాకేజీ పనులు పొంగులేటి కంపెనీ దక్కించుకోవడంతో కంపెనీ ముఖవిలువ, టెండర్ ప్రక్రియ జరిగిన తీరు తదితర అంశాలపై ఈడీ అధికారులు ప్రశ్నించినట్టు సమాచారం.

### మేఘాతో రాఘవ

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులను రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌తోపాటు మేఘా ఇంజినీరింగ్ కంపెనీ దక్కించుకున్నది. ఎన్‌కేఎల్ఐఎస్ ప్యాకేజీ పనులను దక్కించుకున్న రాఘవ కన్‌స్ట్రక్షన్స్, మేఘా కంపెనీలు ముందే కూడబలుక్కుని, లోపాయికారి ఒప్పందం చేసుకున్నాయనే ఆరోపణలొచ్చాయి. రూ.1,134.62 కోట్లతో చేపట్టాల్సిన ప్యాకేజీ-1 పనులకు రాఘవ కన్‌స్ట్రక్షన్ కంపెనీ అంచనా వ్యయం కంటే 3.95% అధికంగా కోట్ చేసింది. అదే పనులకు మేఘా ఇంజినీరింగ్ కంపెనీ 4.85% అధికంగా కోట్ చేసింది. దీంతో ఎల్1గా నిలిచిన రాఘవ కంపెనీకి ప్యాకేజీ-1 టెండర్ దక్కింది. రూ.1,126.85 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ప్యాకేజీ-2 పనులకు మేఘా ఇంజినీరింగ్ 3.95% అధికంగా కోట్ చేయగా, రాఘవ కంపెనీ 4.8% అధికంగా కోట్ చేసింది. దీంతో ఎల్-1గా నిలిచిన మేఘా ఇంజనీరింగ్ కంపెనీకి ప్యాకేజీ-2 టెండర్ దక్కింది. మేఘా కంపెనీ అధికంగా కోట్ చేసిన చోట రాఘవ కంపనీ తక్కువగా కొటేషన్ దాఖలు చేయడం, మేఘా కంపెనీ తక్కువ కోట్ చేసిన చోట రాఘవ కంపెనీ అధికంగా కొటేషన్ దాఖలు చేయడం లోపాయికారి ఒప్పందంలో భాగమేనని ఆరోపణలు వచ్చాయి. ఇక, ఈ ప్రాజెక్టు పనుల కోసం ఎల్అండ్‌టీ, ఎన్‌సీసీ (నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ) సైతం బిడ్లను దాఖలు చేశాయి. చివరకు మేఘా, రాఘవ కంపెనీలే అర్హత సాధించాయి. దీంతో టెండర్‌కు ముందే ఈ ఇరు కంపెనీలు కూడబలుక్కున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు ఆయా కంపెనీలు దాఖలు చేసిన కొటేషన్లే నిదర్శనమని పలువురు ఆరోపిస్తున్నారు.

# 870 కోట్ల ఆర్థిక అక్రమాలు?

మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్‌తోపాటు మరొకటి ఖమ్మంలోని రాఘవ కన్‌స్ట్రక్షన్ ఆఫీసులో జరిగినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అయితే, శుక్రవారం జరిపిన సోదాల సందర్భంగా మూడు నగదు లెక్కింపు యంత్రాలను తీసుకెళ్లిన అధికారులు.. దొరికిన డబ్బుపై పంచనామా పూర్తిచేసి, సంతకాలు చేయించుకున్నారని తెలిసింది.

### 'రాఘవ ప్రైడ్ తరలింపులపై' ఈడీ ఆరా..

బంజారాహిల్స్‌లోని రోడ్ నంబర్ 10లో ఉన్న రాఘవ ప్రైడ్ ఆఫీసు నుంచి జరిగిన తరలింపులపై ఈడీ దృష్టి సారించినట్టు తెలిసింది. రాఘవ ప్రైడ్‌లోని కీలకమైన డాక్యుమెంట్లు, నగదు, ఇతర ఎలక్ట్రానిక్, డిజిటల్ సామగ్రిని కార్లలో తరలించిన విషయం శనివారం పలు దినపత్రికల్లో రావడంతో హైదరాబాద్ ఈడీ అధికారులు ఆరా తీశారు. ఆ సమాచారాన్ని పత్రికల్లో వచ్చిన క్లిప్పింగ్స్‌ను ఢిల్లీ నుంచి వచ్చిన ఈడీ అధికారులకు పంపినట్టు తెలిసింది. హైదరాబాద్‌లోని జాతీయ మీడియా ప్రతినిధుల ద్వారా కూడా పలు వివరాలు సేకరించినట్టు సమాచారం. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన ఏ సోదాలైనా 'రాఘవ ప్రైడ్' అత్యంత కీలకమనే అంశాన్ని ఆలస్యంగా తెలుసుకున్నామని.. ఈడీ అధికారులు జాతీయ మీడియా ప్రతినిధులకు చెప్పినట్టు తెలిసింది. అయితే, రెండ్రోజుల ఈడీ సోదాలపై అధికారులు ఆదివారం అధికారికంగా ప్రకటించనున్నట్టు తెలిసింది.

### ఇంటి వైపు కన్నెత్తి చూడని మంత్రి..

ఈడీ సోదాలు శనివారం కూడా కొనసాగుతాయని తెలుసుకున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. అర్ధరాత్రి వరకూ జూబ్లీహిల్స్‌లోని ఇంటికి గాని, అటు హిమాయత్‌సాగర్‌లోని ఫామ్‌హౌజ్‌కు వెళ్లలేదని తెలిసింది. మినిస్టర్ క్వార్టర్స్‌కు, సచివాలయానికి తప్ప.. మంత్రి పొంగులేటి ఎక్కడికీ వెళ్లలేదని అధికారులు పేర్కొన్నారు. సచివాలయంలో శనివారం జరిగిన పలు సమావేశాల్లో మంత్రి పొంగులేటి ముభావంగా కనిపించారని చెప్తున్నారు. సోదాలు జరిగిన ప్రతిసారి, అదే రోజు మీడియా ముందుకు వచ్చి ఏం జరిగిందో పొంగులేటి చెప్పేవారు. రెండ్రోజుల తనిఖీలు పూర్తయినా కూడా ఆయన మీడియా ముందుకు రాకపోవటం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నదని కాంగ్రెస్‌లోని ఆయన వ్యతిరేక వర్గం వ్యాఖ్యానించింది. ఈడీ సోదాలపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, అద్దంకి దయాకర్ మినహా ఏ ఒక్కరూ స్పందించలేదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఈ దాడులపై పెదవి విప్పలేదు.

